క్లుప్తంగా

విజేతలకు బహుమతులు

రామవరప్పాడు: ఎనికేపాడు విజయ కళాశాల గ్రౌండ్‌లో కెసీసీ ఎఫ్‌సీ సుధాకర్ ఆధ్వర్యంలో 32 టీమ్స్‌కు గత కొన్ని రోజులుగా జరుగుతున్న శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ తల్లి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఆదివారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ విజేతలు బీసీసీ జట్టుకు రూ.50,000 నగదు బహుమతి, టోర్నమెంట్ రన్నర్స్‌గా నిలిచిన శాంఢి సీసీ-2 జట్టుకు రూ.25000 బహుమతులను అందజేశారు. 2 మ్యాచ్‌లకు సిక్స్‌లు కొట్టి బౌల్డ్ చేసిన ప్లేయర్స్‌కు అడక రాజేష్ నగదు బహుమతి, టోర్నమెంట్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ సాధించిన టీమ్‌కు సెల్‌ఫోన్‌ను కూనపరెడ్డి మధుబాబు, బెస్ట్ క్యాచ్ ప్లేయర్స్‌కు అక్షయ పికిల్స్ వారు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్ మొత్తం మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లకు గిఫ్టులను రాందేవ్ మొబైల్స్ అందజేశారు.

గన్నవరం సీఐగా ప్రసాద్

గన్నవరం: గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కేవీఎస్‌వీ. ప్రసాద్ నియమితులయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆదివారం ఏలూరు రేంజ్‌లో సీఐలను బదిలీలు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు గన్నవరం సీఐ పి.కనకరావును ఏలూరు రేంజ్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మచిలీపట్నంలో పనిచేస్తున్న కేవీఎస్‌వీ.ప్రసాద్ నియమించారు. బదిలీపై వెళ్తున్న సీఐ పి.కనకరావు సుమారు ఏడాది పాటు ఇక్కడ సేవలందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనమలూరు: కానూరులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు గ్రామంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.16,200 సొమ్ము స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

19 నుంచి వనవలమ్మ జాతర

మచిలీపట్నంటౌన్: స్థానిక నిజాంపేటలోని నూతి వీరయ్య ఆదివనవలమ్మ దేవి 107వ వార్షిక గ్రామోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి జరుగుతాయని నిర్వాహకులు నూతి వన వెంకట సత్యనారాయణ (రమణ) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఉదయం 8.15 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, ఆలయంలో 101 దేవతల నామాలతో పూజా కార్యక్రమం, 20న అమ్మవారికి పసుపు, కుంకుమ ఉత్సవం, 21న జాతర మహోత్సవం, 22న అమ్మవారికి వెండిచీరను అలంకరించిన అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 18వ తేదీన నెల సంబరం నిర్వహిస్తామని వివరించారు.

నూతన వస్త్రాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని 3వ డివిజన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదివారం నూతన వస్త్రాలను అందజేశారు. డెప్యూటీ మేయర్ శీలం భారతి ఏర్పాటు చేసిన వీటిని పేర్ని నాని చేతుల మీదుగా అందజేశారు. మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ పాల్గొన్నారు.

10 మంది జూదరుల అరెస్ట్

మోపిదేవి: మోపిదేవి ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ శనివారం రాత్రి మండల పరిధిలోని కొక్కిలిగడ్డ గ్రామంలో బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 6,470 స్వాధీనం చేసుకున్నారు.

క్యాంటీన్‌లోకి దూసుకెళ్లిన కారు



గూడూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి క్యాంటీన్‌లోకి దూసుకు వెళ్లింది. విజయవాడ నుంచి మచిలీపట్నం మండలం గుండుపాలెం వెళ్తున్న కారు ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో అదుపుతప్పి క్యాంటీన్‌లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో క్యాంటీన్‌లో సరుకు వేస్తున్న పుప్పాల బంగారు నాంచారయ్య కాలికి గాయాలయ్యాయి. బాధితుడిని బందరు ఆస్పత్రికి తరలించారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి

- గ్రామాల్లో వేడుకగా సంక్రాంతి
- ఉత్సాహంగా భోగి మంటలు
- గాలిపటాలతో సందడి చేసిన చిన్నారులు
- సంప్రదాయబద్ధంగా కోడి పోరు
- పిండివంటలు, బంధుమిత్రుల రాకతో పల్లెలు కళకళ



హనుమాన్‌జంక్షన్‌లో భోగి మంటలు, గంగిరెద్దుల సందడి



నున్న యోగీశ్వర్ దేవిదయాళ్ మహామందిరంలో భోగి మంటలు



గన్నవరంలో భోగి మంటలు వేస్తున్న వాకర్స్



యనమల కుదురులో హోరాహోరీగా కోడి పోరు



పూజలు నిర్వహిస్తున్న ఈవో లోకేశ్వరి, చైర్మన్ భోయిన భాను ప్రదీప్



సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు

ఉయ్యూరు: సంక్రాంతి సంబరాలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. భోగి పర్వదినమైన ఆదివారం వేకువఝామునే భోగిమంటలు వేసి సందడి చేశారు. చిన్నారులు, యువత గాలిపటాలు ఎగురవేసి సంతోషంగా గడిపారు. మహిళలు రంగవల్లులు తీర్చిదిద్ది సంక్రాంతి పండుగకు స్వాగతం పలికారు. ఉయ్యూరు మండలంలోని పలు చోట్ల బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు నిర్వహించారు. పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

భోగిమంటలు, గంగిరెద్దుల సందడి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో భోగి పండుగ సరదా, సందడితో ఉత్సాహంగా జరిగింది. గ్రామాల్లో భోగి వేడుకను కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీస్సులు అందించారు. రంగు రంగుల రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలతో ప్రతి వీధిలోనూ సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. హనుమాన్‌జంక్షన్‌లోని ప్రముఖ పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్ కుమార్ ఫాంహౌస్‌లో వేడుకల్లో సంస్కృతి, సంప్రదాయలకు అద్దం పడుతూ భోగి వేడుకలు నిర్వహించారు. బాపులపాడు మండలం అంపాపురంలో వంశీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి వేడుకల్లోనూ భోగి సంబరాలు ఘనంగా జరిగాయి.

వాకర్స్ ఆధ్వర్యంలో..

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ భోగి మంటలు వేయడంతో పాటు సంక్రాంతి పాల పొంగళ్లు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పాడ చంద్రశేఖర్‌రావు పండుగ విశిష్టతను వివరించారు. అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు, కరాటే కోచ్ వెంకట్రావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పెనమలూరు: మండల పరిధిలో భోగి సందర్భంగా ఆదివారం వేకువ జామునే గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేసుకున్నారు. ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. మహిళలు, పిల్లలు నూతన వస్త్రాలు ధరించి ఆటపాటల్లో పాల్గొన్నారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. కాగా యనమలకుదురు, పెనమలూరులో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి జనాలు కోడి పందేలకు తరలివచ్చారు. మరో రెండు రోజుల పాటు గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందడి ఉంటుంది.

నున్న(విజయవాడరూరల్): భోగి పండుగను ఆదివారం తెల్లవారుజామున గ్రామాల్లో ప్రజలు సంప్రదాయబద్ధంగా భోగిమంటలను వేశారు. నున్న గ్రామంలో శ్రీయోగీశ్వర్‌దేవిదయాళ్ మహామందిరంలో భోగి మంటలను వేసి పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ మహాక్షేత్రం చినకంచిలో వేదపాఠశాల విద్యార్థులు, పరిసర కుటుంబాలతో కలిసి భోగి మంటలు వేశారు. శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం పరిసరప్రాంతాల్లో ప్రజలు ఇళ్లల్లోని పాత సామగ్రితో భోగి మంటలు వేశారు. అనంతరం పిల్లలకు భోగిపళ్లు పోసి తలంటారు. నున్న గ్రామంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలను తీర్చిదిద్దారు. విలేజి కండ్రిక, పాతపాడు, వెంకటాపురం, అప్పారావుపేట, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేసి పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

రామవరప్పాడు : రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 4 గంటల నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. విఘ్నేశ్వరపూజతో ఆలయంలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పుణ్యాహవాచనము, కుంకుమ పూజా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని భక్తి శ్రద్ధలతో అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్‌లు ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి రథోత్సవం ఇరు గ్రామాల్లో కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు వివరించారు.

కోడి పందేల సందడి



కంకిపాడులో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరం

కంకిపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులు పాటు కంకిపాడు మండలంలో సంప్రదాయబద్ధంగా ఏటా కోడిపందేల బరులు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా కంకిపాడు, గొడవర్రు, ఈడుపుగల్లు, ఉప్పలూరు గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలకు తలమానికంగా, పండుగ శోభ సంతరించుకునేలా బరుల్లో సంప్రదాయ కోడిపందేలను నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆయా గ్రామాల్లో కోడిపందేలు జరిగాయి. పందేలను వీక్షించేందుకు ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్క్రీన్లు ఏర్పాటుచేయటం, తలపడే కోడిపుంజుల గురించి వర్ణించటం వంటివి ప్రత్యేక ఆకర్షణ.

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

- ఏఎంసీ ఛైర్‌పర్సన్ తోట కరుణ
- ముగిసిన యంగ్ బాయ్స్ క్రికెట్ పోటీలు



హరీష్ సీసీ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏఎంసీ ఛైర్‌పర్సన్ కరుణ, వెంకయ్య, ఏడుకొండలు

గన్నవరం రూరల్: క్రీడలతో శారీరక ధారుడ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ తోట కరుణ చెప్పారు. ఆదివారం మండలంలోని సూరంపల్లి వేణుగోపాలస్వామి క్రీడా మైదానంలో స్థానిక యంగ్ బాయ్స్ కమిటీ ఆధ్వర్యంలో వరుసగా ఏడో ఏడాది నిర్వహించిన సంక్రాంతి క్రికెట్ పోటీలు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజేతలకు కరుణ బహుమతులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 46 క్రికెట్ టీమ్‌లు పాల్గొని క్రీడాస్ఫూర్తితో క్రికెట్ పోటీలలో పాల్గొనటం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో విన్నర్‌గా హరీష్ సీసీ సావరగూడెం, రన్నర్‌గా బీజేఆర్ సీసీ అడవినెక్కలం నిలిచాయి. వారికి కరుణ ట్రోఫీలు అందజేశారు. సూరంపల్లి కందిమళ్ల సరస్వతీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు నగదు బహుమతులు అందజేశారు. విన్నర్ టీమ్‌కు రూ.20 వేలు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య అందజేశారు. రన్నర్ టీమ్‌కు సూరంపల్లి సహకార బ్యాంకు ఛైర్‌పర్సన్ తుల్లిమిల్లి ఏడుకొండలు రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు. విజేతలుగా రాణించిన క్రీడాకారులను తోట కరుణ, వెంకయ్య, ఏడుకొండలు, డాక్టర్ కందిమళ్ల సందీప, వార్డు సభ్యులు కందిమళ్ల రాఘవ, యఫ్నుష్ వర్మ, దీపిక గ్రామ పెద్దలు అభినందించారు.

వైభవంగా శ్రీగోదాదేవి కల్యాణం



గన్నవరంలో శ్రీకృష్ణస్వామి, శ్రీగోదాదేవి అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీగోదాదేవి అమ్మవారి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. తొలుత ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణస్వామి, శ్రీగోదాదేవి అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి గీతాలతో నగర సంకీర్తన, తిరుప్పావై ప్రబంధ పారాయణం జరిపారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులను తీసుకువచ్చారు. పలువురు దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించారు. సముహూర్తంలో ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో శ్రీకృష్ణస్వామి, శ్రీగోదాదేవి అమ్మవార్లకు కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన జరిపారు. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, పరిసరా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్)లో

నున్న(విజయవాడరూరల్): ధనుర్మాసం చివరి రోజు ఆదివారం ప్రసిద్ధ మహాక్షేత్రం చినకంచిలో గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. ప్రసన్న శ్రీ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగనాథునితో గోదాదేవి కల్యాణం జరిపారు. భక్తులకు తీర్థప్రసాదముల వితరణ జరిగింది. అన్నదానం చేశారు. తర్వాత మోహన్ దంపతులు వేదపాఠశాలలోని విద్యార్థులకు, అర్చకులకు నూతన వస్త్రాలను అందజేశారు. నున్న గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాసం ఆఖరి రోజున గోదాదేవి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అనేక మంది పుణ్యదంపతులు పాల్గొని ఉత్తరాయణం మాసానికి స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదములను పంపిణీ చేశారు.

పెనమలూరు: పోరంకిలో శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయంలో భోగి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆదివారం రాత్రి గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం కనులపండుగగా జరిగింది. ధనుర్మాసం నెలరోజుల వ్రతంలో భాగంగా తిరుప్పావై అనుసంధించి శ్రీగోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తుల సమక్షంలో స్వామివార్ల కల్యాణం చేశారు. శ్రీచెన్నకేశవస్వామి వార్ల ఆలయంలో కూడా స్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



పోరంకిలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వైభవంగా తంబి తిరునాళ్ల



సమష్టి దివ్య పూజాబలిని సమర్పించేందుకు వెళ్తున్న కార్డినల్ పూల అంథోని



తంబి సమాధి ఆలయం వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు

ఉంగుటూరు: బ్రదర్ జోసఫ్ తంబి ప్రార్థన, విశ్వాసం ద్వారా క్రీస్తు రక్షణను ఈ లోకంలో ఫలింపజేశారని గుంటూరు బిషప్ చిన్నబత్తిన భాగ్యయ్య అన్నారు. మండలంలోని పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి మహోత్సవాలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఉదయం 7గంటలకు గుంటూరు బిషప్ చిన్నబత్తిన భాగ్యయ్య తంబి సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహించిన అనంతరం కళావేదికపై దివ్య పూజాబలిని సమర్పించారు.

కిక్కిరిసిన క్షేత్రం..

ఉత్సవాల్లో రెండోరోజు ఆదివారం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యాత్రికులతో పుణ్యక్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. సాయంత్రం 5గంటలకు హైదరాబాద్ అగ్రపీఠాధిపతులు కార్డినల్ పూల అంథోని తంబి సమాధిని సందర్శించి కళావేదిక వద్ద సమష్టి దివ్య పూజా బలిని సమర్పించారు. జోసఫ్ తంబిని ఆదర్శంగా తీసుకుని క్రైస్తవ విశ్వాసాన్ని బలపరచుకోవాలని పిలుపునిచ్చారు. ఫాదర్ జాన్, మాథ్యూస్ ఆధ్వర్యంలో సెయింట్ ఫ్రాన్సిస్, బ్రిందిసి బ్రదర్లు పాటలను ఆలపించారు.



తంబి క్షేత్రంలో సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

ప్రార్థనా మందిర నిర్మాణానికి ఆర్థిక సాయం

బోడగుంట(మోపిదేవి): బోడగుంట దళితవాడలో నిర్మిస్తున్న బాపిస్టు చర్చి నిర్మాణానికి అవనిగడ్డకు చెందిన శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ వరుణ్, సంఘ సభ్యులు కొక్కిలిగడ్డ రమేష్‌బాబు, కొమ్ము ఇస్సాక్ పాల్గొన్నారు.